క్లుప్తంగా

ముంచంగిపుట్టు ఎంపీడీవోగా రమేష్



ఎంపీడీవో రమేష్

ముంచంగిపుట్టు: ఎంపీడీవోగా ఆర్.వి.ఎస్. రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో కిరణ్‌కుమార్ సెలవులపై వెళ్లటంతో జి.మాడుగులలో పని చేస్తున్న ఈవోపీఆర్డీ రమేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికి కృషి చేయడంతోపాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. వివిధ కారణాలతో రద్దయిన పింఛన్లు పరిశీలించి, 476 నోటీసులను పునఃపరిశీలించి అర్హులందరికీ పింఛన్లు అందిస్తామన్నారు. నూతన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పీఆర్టీయూ క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, పీఆర్టీయూ నాయకులు

దుంబ్రిగుడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీఆర్టీయూ డైరీలు, క్యాలెండర్లను ఎంపీపీ బాక ఈశ్వరి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా ఇవి ఉన్నాయని అభినందించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, ఉప సర్పంచ్ జగ్గునాయుడు, బాక సింహాచలం, నర్సింగ్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు అప్పలరాజు, శ్రీను, రాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

దుంబ్రిగుడ: కిల్లోగుడ గిరిజన సంక్షేమ శాఖ ఇంగ్లిష్ మీడియం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాడేరులో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన గిరి విజ్ఞాన సంబరాల క్రీడా పోటీలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా కబడ్డీ, షటిల్, రన్నింగ్, షాట్‌పుట్ తదితర పోటీల్లో ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్ సాధించారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం కళావతి, ఉపాధ్యాయులు, పీడీ కమల్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ సమావేశం

దుంబ్రిగుడ: సర్పంచ్ రామూర్తి అధ్యక్షతన సోమవారం కోల్లాపుట్టు పంచాయతీ బుసిపుట్టులో ఆటో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు నుంచి బుసిపుట్టు వరకు ఒక ప్రయాణికుడి నుంచి రూ.40 చార్జీ తీసుకోవాలని నిర్ణయించారు. కొర్రాయి సర్పంచ్ కొములు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

5 నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

రాజవొమ్మంగి: మండలంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు పంచాయతీల వారిగా ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె. బాపన్నదొర సోమవారం తెలిపారు. బృందాలుగా ఏర్పడిన ఆడిటర్లు ఆయా పంచాయతీల్లో పర్యటించి ఉపాధి పనుల ప్రగతి, అక్రమాలపై సమగ్ర నివేదిక తయారు చేస్తారన్నారు. గ్రామసభలు ఈ నెల 5న ఉదయం 10 గంటలకు శరభవరం, లోదొడ్డి పంచాయతీల్లో, 11 గంటలకు దూసరపాము, మధ్యాహ్నం 2 గంటలకు వంచంగి, వాంతంగిలలో, 3 గంటలకు కింద్రలో నిర్వహిస్తామన్నారు. అనంతరం మండల స్థాయి ప్రజాదర్బార్ స్థానిక ఉపాధిహామీ కార్యాలయం వద్ద ఈ నెల 10న బహిర్గతం చేస్తారన్నారు.

కోటి పుణ్యాలకు సాటి.. ముక్కోటి

- గోవింద నామస్మరణతో మార్మోగిన పవనగిరి గిరులు
- కనుల పండువగా శ్రీదేవి భూదేవి సమేత బాలాజీ స్వామి కళ్యాణ మహోత్సవం
- భక్తజన సంద్రంతో గిరిప్రదక్షిణ



అడ్డతీగల: స్వామి అమ్మవార్లను తోడ్కొని గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు



రాజవొమ్మంగి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో లక్షదళ పూజ చేస్తున్న భక్తులు



సీలేరు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



వీఆర్‌పురం: భక్తులకు దర్శనమిస్తున్న సుందరసీతారామచంద్ర స్వామివారు

అడ్డతీగల: పవిత్ర ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా అడ్డతీగలలోని పవనగిరి గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో పురోహితులు వేద మంత్రోచ్చరణలతో సోమవారం వేకువజాము నుంచి 15 దేవదేవుళ్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అయ్యప్పశర్మ, గణేశ్‌శర్మ పౌరోహిత్యంలో శ్రీదేవి,భూదేవి సమేత బాలాజీ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పలువురు పుణ్యదంపతులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి భక్తులు భుజాలపై మోసుకుంటూ గోవిందా నామస్మరణతో పవనగిరి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో పల్లకీ సేవ చేశారు. ఈ సేవకి రాయపల్లి కోలాట బృందాలు శ్రీనివాసుని భక్తి గీతాలకు కోలాటం చేస్తూ వచ్చాయి. శ్రీరామ పట్టాభిషేకం ఘటనను జ్ఞప్తికి తెస్తూ సీతారామలక్ష్మణుడు, ఆంజనేయస్వామి తదితర్ల వేషధారణలతో జైశ్రీరామ్ నినాదాలతో పల్లకీ సేవకి వన్నె తెచ్చారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

రాజవొమ్మంగి: స్థానిక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామి దేవేరులను దర్శించుకున్నారు. ఆలయంలో లక్ష తులసి దళ పూజ, హోమాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. ఆలయాన్ని, స్వామి అమ్మవార్లను రంగురంగుల పూలతో అలంకరించారు. సాయంకాలం చిన్నారుల కోలాటం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది.

సీలేరు: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సీలేరు వేంకటేశ్వరస్వామి ఆలయంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో ఉత్తరద్వారాన్ని దర్శించుకున్నారు. స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి, పూజలు నిర్వహించారు.

వీఆర్‌పురం: స్థానిక శ్రీరామగిరి కొండమీద ఆలయంలో సుందర సీతారామచంద్ర స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రధాన అర్చకుడు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రేవు బాలరాజు, ఎంపీపీ కారం లక్ష్మి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలతో బోధన



ట్యాబ్‌లు పంపిణీ చేసిన విద్యార్థులతో ఎంపీపీ, ప్రిన్సిపాల్

కొయ్యూరు: ప్రభుత్వం అత్యున్నత ప్రమాణాలతో బోధన చేస్తుందని ఎంపీపీ బడుగు రమేష్ తెలిపారు. కొయ్యూరు గురుకుల పాఠశాలలో బైజూస్ ట్యాబ్‌లను ఆయన సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మంపలో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాంకేతిక విద్య

సీలేరు: పేద విద్యార్థులు భవిష్యత్ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో సాంకేతిక విద్య అందిస్తున్నారని హెచ్‌ఎం రామన్న తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వీటిపై అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం రామన్న

హుకుంపేట: స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం బాలికల పాఠశాలలో హెచ్‌ఎం జంపరంగి లంబన్న, పాఠశాల చైర్మన్ వండలి నాగేశ్వరరావు సోమవారం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పసుపు ఉడికించు యంత్రాల పంపిణీ

జి.మాడుగుల: నేరేడువలసలో గిరిజన రైతులకు ఆర్బీకే ద్వారాల మంజూరైన పసుపు ఉడికించు యంత్రాలను సర్పంచ్ కిముడు రాంబాబు సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై వీటిని అందిస్తుందన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్య కొండంనాయుడు, వీహెచ్‌ఏ జీవన్, గ్రామ వలంటీర్ ఎం కూర్మారావు పాల్గొన్నారు.



పసుపు ఉడికించు యంత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాంబాబు

తూనికల్లో వ్యాపారుల దగా

మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రాజ రమేష్



పెదబయలు వారపు సంతలో కాటాలు పరిశీలిస్తున్న మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రాజ రమేష్

పెదబయలు: గిరిజన ఉత్పత్తులు వారపు సంతకు అమ్మకానికి తెస్తే తూనికల్లో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రాజ రమేష్ ఆగ్రహించారు. సోమవారం పెదబయలు వారపు సంతను పరిశీలించారు. జిల్లాలో ఎక్కువగా పసుపు, పిప్పళ్లు, రాజ్‌మా, ఇతర పంటల కొనుగోళ్లలో వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో రైతులు నష్టపోతున్నారని వాపోతున్నారు. జీసీసీ నిర్ణయించిన ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తుండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. సంతల్లో వ్యాపారులు ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని, దుకాణాల్లోనూ ఇవి ఉండాలని సూచించారు. తూకాల్లో తరుగు పేరుతో కేజీలకు కోత పెడుతున్నారని రైతులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. సీతగుంట గ్రామ పంచాయతీ సంతలో సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. సంత వేలం నిధులు ఇందుకు వెచ్చిస్తామన్నారు. తూనికల కోసం ఏర్పాటు చేసిన భవనం వినియోగంలోకి తేవాలన్నారు. ఎంపీడీవో, జీసీసీ, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. జెడ్పీటీసీ బొంజుబాబు, పెదబయలు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆర్.ధనలక్ష్మి, ఆరు మండలాల డైరెక్టర్లు, ఈవోపీఆర్డీ నర్సింగరావు, ఆర్ఐ, వీఆర్వో సత్యారావు, సర్పంచ్‌లు మాధవరావు, కృష్ణారావు, మాజీ సర్పంచ్ సింహాచలం, నాయకులు కనకరాజు, అజయ్‌కుమార్, బాలరాజు పాల్గొన్నారు.

పింఛన్ల హామీ నిలబెట్టుకున్న సీఎం జగన్

దశలవారీగా నగదు పెంపుతో పింఛనుదారుల ఆనందం



దుంబ్రిగుడ: బల్లుగుడలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి



అరకులోయ రూరల్: పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ ఉపేంద్ర, నాయకుడు రంజిత్‌కుమార్



గంగవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ గంగాదేవి



పాడేరు రూరల్: కొత్త పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ సొనారి రత్నకుమారి, సర్పంచ్‌లు



కొయ్యూరు: రావణాపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ



జి.మాడుగుల: లువ్వాసింగిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సన్యాసిదొర



మోతుగూడెం: పొల్లూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆకేటి సీత

దుంబ్రిగుడ: ఇచ్చిన మాట ప్రకారం దశలవారీగా పింఛన్ల నగదు పెంచుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ బాక ఈశ్వరి తెలిపారు. సోమవారం బల్లుగుడలో ఎంపీపీ బాక ఈశ్వరి, కొర్రా పంచాయతీలో ఎంపీటీసీ గుజ్జెల విజయ, కండ్రుం పంచాయతీలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్ హరి, పోతంగి పంచాయతీ చంపపట్టి గ్రామంలో సర్పంచ్ వెంకటరావు వేర్వేరుగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, వైస్ సర్పంచ్ జగ్గునాయుడు, నర్సింగ్, చిరంజీవి, గణపతి, బాలరాజు, సునీల్ పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని పది గ్రామ సచివాలయాల పరిధిలో 60 గ్రామాల్లోనూ పింఛన్లు పంపిణీ వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. సోమవారం బర్రిమామిడిలో జెడ్పీటీసీ బేబిరత్నం, మర్రిపాలెంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, గంగవరంలో వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి పింఛన్లు పంపిణీ చేశారు. వివిధ గ్రామాల్లో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వీటిని అందించారు.

అరకులోయ రూరల్: చిన్నలబుడు పంచాయతీలో లబ్ధిదారులకు సోమవారం సర్పంచ్ ఉపేంద్ర పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు లక్ష్మణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల నాయకుడు రంజిత్‌కుమార్, వార్డు సభ్యులు రాజ్‌కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

జి.మాడుగుల: పెదలువ్వాసింగి పంచాయతీలో సోమవారం లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కొండపల్లి సత్యనారాయణ, ఉప సర్పంచ్ గణపతి, మాజీ సర్పంచ్ గబ్బాడి పండుదొర, ఏఎంసీ డైరెక్టర్ ఈశ్వరపడాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పండగలా రెండో రోజూ పింఛన్ల పంపిణీ

కొయ్యూరు: పింఛన్ల పంపిణీని రెండో రోజు సోమవారం పండగలా నిర్వహించారు. రావణాపల్లిలో చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జే రాజులమ్మ పింఛన్ల సొమ్ము పంపిణీ చేశారు. కంతారంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి పంపిణీ చేశారు. సర్పంచ్ కన్నయమ్మ, సీనియర్ నాయకుడు గాడి సత్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యురాలు షేక్ అమ్మాజీ, ఉప సర్పంచ్ వనంబాబు పాల్గొన్నారు. ఎం మాకవరంలో సర్పంచ్ కోడా చింతల్లి, చింతలపూడి ఎంపీటీసీ పొడుతు రత్నం పింఛన్లు పంపిణీ చేశారు. మూలపేటలో సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. సచివాలయ కన్వీనర్ నీలాపు నూకరాజు, ఉప సర్పంచ్ చిట్టబాయి పాల్గొన్నారు. కొండగోకిరి పంచాయతీలో పార్టీ మండలాధ్యక్షుడు జల్లి బాబులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, కినపర్తి సర్పంచ్ శ్రీను, పాటి చిన్నయ్య, సచివాలయ కన్వీనర్లు రామరాజు, పాటి చంద్రశేఖర్, పింఛన్లు పంపిణీ చేశారు.

పాడేరు రూరల్: ఎన్నికల హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ సొనారి రత్నకుమారి అన్నారు. వంతాడపల్లి గ్రామ సచివాలయంలో సోమవారం కొత్త పింఛన్లు ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వంతాడపల్లి, కిండంగి సర్పంచ్‌లు మాదెలి రవణమ్మ, కుమారి, మాజీ ఎంపీపీ ఎస్వీ రమణమూర్తి పాల్గొన్నారు.

మోతుగూడెం: పొల్లూరు గ్రామంలో పెంచిన పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు సర్పంచ్ ఆకేటి సీత పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పేపకాయల శ్రీను, పొరుపల్లి పార్వతి, ఉప సర్పంచ్ మీనా సుజాత, వార్డు సభ్యులు పల్లాల మాదిరెడ్డి, శివరామృష్ణ, త్రిమూర్తులు, శరత్, వెంకట్ పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తే గ్రామాలభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు, పక్కన ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి

హుకుంపేట: మండలంలోని గ్రామాలభివృద్ధికి అధికారులు నాయకులతో కలిసి సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ కూడా రాజుబాబు కోరారు. ఆయన అధ్యక్షతన సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 29 శాఖలతో సమీక్షించాల్సి ఉండగా, 15 శాఖల అధికారులు హాజరయ్యారు. విద్యుత్ శాఖలో సమస్యలు తీర్చాలని, ఇనుప స్తంభాలు మార్చాలని, విద్యా శాఖలో పాఠశాలలు మంజూరు చేయాలని, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు విన్నవించారు. తదుపరి సర్వసభ్య సమావేశంలోగా ఈ సమస్యలు పరిష్కరించి చూపించాలన్నారు. ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంఈవో రామచంద్రరావు, సీడీపీవో బాలంచంద్రమణిదేవి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజారోగ్యానికి భరోసా



వీరవరం సబ్ సెంటర్‌లో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

అడ్డతీగల: ప్రజారోగ్యానికి ఫ్యామిలీ డాక్టర్ భరోసా వంటిదని దుప్పులపాలెం వైద్యాధికారి స్పందన, 104 వాహన వైద్యుడు పి.నాగేశ్వరావు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వీరవరంలో వీరు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 35 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెచ్‌వీ పద్మావతి, ఎంపీహెచ్‌ఏ మురళీకృష్ణారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ వాసు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గం ఇన్‌చార్జి శాంతకుమారి



గ్రామస్తులతో శాంతకుమారి

అరకులోయ రూరల్: పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గం ఇన్‌చార్జి పాచిపెంట శాంతకుమారి తెలిపారు. సోమవారం చిన్నలబుడు పంచాయతీ హట్టాగుడలో ఆమె పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సబ్ ప్లాన్ నిధులు కేటాయిస్తే గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. పార్టీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు సాయిబాబా, నాయకులు మోహన్, చిన్నస్వామి, ప్రేమ్‌కుమార్, భగత్‌రాం, కొండమ్మ, పద్మ పాల్గొన్నారు.

బోరు నిర్మాణ పనులు ప్రారంభం

జి.మాడుగుల: లువ్వాసింగి పంచాయతీ బొరికి మామిడిలో బోరు నిర్మాణ పనులను ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర సోమవారం ప్రారంభించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవతో రూ.1.50 లక్షలు ఈ పనులకు మంజూరయ్యాయని పేర్కొన్నారు. వైస్ సర్పంచ్ గబ్బాడి గణపతి, మాజీ సర్పంచ్ పండుబాబు, వార్డు సభ్యులు మసాడి సింహాచలం, నాయకులు కోరాబు సన్యాసిపడాల్, గబ్బాడి కొండబాబు, ఏఎంసీ డైరెక్టర్ ఈశ్వర్‌పడాల్ పాల్గొన్నారు.

మాతృభాషా వలంటీర్ల వినతి

ముంచంగిపుట్టు: మాతృభాషా విద్యా వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను డిమాండ్ చేశారు. స్థానిక ఎంఈవో చెల్లయ్యకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం వారు వినతి పత్రం అందించారు. ఐటీడీఏ పీవో, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు జనవరి 3వ తేదీ నుంచి 11 మండలాల్లో మాతృభాషా విద్యా వలంటీర్లను విధు ల్లోకి తీసుకోవాలని కోరారు. విద్యా వలంటీర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు కొండయ్య, గణేష్ పాల్గొన్నారు.

కలాసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జి.మాడుగుల: గిరిజన సహకార సంస్థలో (జీసీసీ) రేషన్ సరుకులు ఎగుమతి, దిగుమతి చేస్తున్న కలాసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. పండుబాబు సోమవారం తెలిపారు. 2021 నుంచి 2022 జనవరిలో పాత ఒప్పందం గడువు ముగిసి 13 నెలలు కావస్తున్నా, నేటికీ కొత్త రేట్లు జీవో, ఏరియర్స్ విడుదల కాలేదని వాపోయారు. దీంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం పూర్తి సమ్మెలోకి దిగుతున్నట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి



బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

రాజవొమ్మంగి: స్థానిక నడిబొడ్డున సర్వే నంబర్ 26/2, 29/4లో 4.06 ఎకరాలు ప్రభుత్వ భూమి అని తహసీల్దార్ వై.వి. సుబ్రహ్మణ్యాచారి స్పష్టం చేశారు. సోమవారం ఆయన సదరు స్థలం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎల్టీఆర్పీ కేసు నంబర్ 29/2007కు సంబంధించి కోర్టు ఉత్తర్వులు అనుసరించి ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ స్థలం తొమ్మిది మంది ఆక్రమించారని, వీరు వెంటనే ఇళ్లు, దుకాణాలను వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించామన్నారు. మంగళవారం దండోరా వేసి వాటికి తాళాలు వేస్తామన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీటీ సత్యనారాయణ, వీఆర్వో భారతి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

చింతపల్లి రూరల్: వ్యాపారులు నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ఎంపీపీ కోరాబు అనూషాదేవి ఆధ్వర్యంలో సోమవారం లంబసింగి, తాజంగిలో రోడ్డుకు ఇరువైపులా చెత్తను పారిశుధ్య కార్మికులతో తొలగించారు. పర్యాటక ప్రాంతమైన లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో వ్యాపారులు నిర్లక్ష్యంగా చెత్తను రోడ్డుకు ఇరువైపులా వేయకుండా నోటీసులు జారీ చేయాలని ఈవోపీఆర్డీ శ్రీనివాస్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



లంబసింగిలో పారిశుధ్యం మెరుగుపరుస్తున్న సిబ్బంది